న్యూస్‌రీల్

బీసీ సంఘాల బైక్ ర్యాలీ



ర్యాలీ తీస్తున్న బీసీ సంఘాల నాయకులు

జన్నారం: చట్ట సభల్లో బీసీల దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ వెంకటకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి కో కన్వీనర్లు కాసెట్టి లక్ష్మణ్, కేపీ నర్సింహులు, విజయ్, లక్ష్మీనారాయణ, భాస్కర్‌గౌడ్, గంగాధర్, తిరుపతి, రాజన్న, నర్సయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

లక్సెట్టిపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. మండల విద్యావనరుల కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి రాజేశ్వర్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్డు బిల్లులు, జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రబీయా, కాంతమ్మ, లక్ష్మి కళావతి, ఎల్లమ్మ, రజిత, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలి



సోమనపల్లిలో మాట్లాడుతున్న రాహుల్

చెన్నూర్‌రూరల్: గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ముందుగా 2023–24అభివృద్ధి ప్రణాళికలో భాగంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. తగు సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామసభలు చేపట్టినప్పుడు గ్రామ పంచాయతీలో ఎలాంటి సమస్యలు ఉన్నాయో గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, డీఎల్‌పీవో ప్రభాకర్, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్ అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని పాల్గొన్నారు.

విశ్వనాథ ఆలయంలో సంకటహర చతుర్థి పూజలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథ ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డిస్టిక్ 107ఏ గవర్నర్ కొండ చంద్రశేఖర్, సభ్యులు తిరుపతి, కొటరపు దత్తు, లక్ష్మణ్, జైన శ్రీనివాస్, మల్యాల శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నస్పూర్: జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రటరీగా పట్టణానికి చెందిన జాడి మణిరత్నం నియామకం అయ్యారు. ఈ మేరకు మంచిర్యాలలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు శివసేనారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ఆదుకోండి సారూ..!



పరామర్శిస్తున్న పురాణం సతీష్‌కుమార్

వేమనపల్లి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వేమనపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పోగుల వెంకటి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటి భార్య అమ్మక్క, కూతుళ్లు ఆయన కాళ్లపై పడి వేడుకున్నారు. కూలీ చేస్తేనే గాని పూట గడవదని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్ కుబిడె మధుకర్, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేషం, నాయకులు రాంచందర్, లక్ష్మణ్, కొండ రాజేష్, నానయ్య ఉన్నారు.

‘కంటి వెలుగు’ విజయవంతం చేయండి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: ప్రజల కళ్లలో వెలుగు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ‘కంటి వెలుగు’ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టి లక్షల మంది కళ్లల్లో వెలుగులు నింపిందన్నారు. ఈ నెల 18 నుంచి చేపట్టే రెండో విడతలో ప్రజలు అధికంగా కంటి పరీక్షలు చేయించుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, ఆర్డీవో కె.శ్యామలాదేవి, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపూర్ణిమ, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్లు, ఆరోగ్య శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. బెల్లంపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంటి వెలుగుపై నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. మండల పరిధిలోని వైద్యులు గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, ఎంపీటీసీ సుభాష్‌రావు, సర్పంచ్‌లు, తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అవెంజలిన్, హెచ్‌ఈవో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నస్పూర్: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ కోరారు. కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లపై మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షల కోసం వచ్చే వారికి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, పలువురు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని డాక్టర్ మానస కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కంటి వెలుగు పథకంపై ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీడీవో అరుణరాణి, వైద్యాధికారి ప్రసాద్‌రావు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: కంటి వెలుగును ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి విజయవంతం చేయాలని ఎంపీపీ గోదారి రమాదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యాధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేడి సునిత, ఎంపీడీవో సత్యనారయణ, ఎంపీవో అనిల్ కుమార్, ఏపీవో బాలయ్య, జైపూర్, కుందారం ఆస్పత్రుల వైద్యాధికారులు అనిల్‌రావు, సమత, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

భీమిని: కంటి వెలుగును విజయవంతం చేయాలని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, వైస్ ఎంపీపీ మధు, ఇన్‌చార్జి డీపీఓ ఫణీందర్‌రావు, ఎంపీవో సబ్దర్‌అలీ, వైద్యుడు కృష్ణ , సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వెలుగుపై అవగాహన

చెన్నూర్‌రూరల్/వేమనపల్లి: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నందున కలెక్టర్ ఆదేశాల మేరకు వేమనపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో, చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం కంటి వెలుగుపై అవగాహన కల్పించనున్నట్లు వేమనపల్లి ఎంపీడీవో లక్ష్మయ్య, చెన్నూర్ ఎంపీడీవో టి.శ్రీనివాస్ కోరారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కార్యదర్శులు, సంబంధిత అధికారులు హాజరుకావాలన్నారు.



నస్పూర్: మాట్లాడుతున్న చైర్మన్ ప్రభాకర్

కంటి వెలుగు అవగాహన బ్యానర్ల విడుదల

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఈ నెల 18నుంచి నిర్వహించే కంటి వెలుగు అవగాహన ప్రచార బ్యానర్లను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో రాష్ట్ర స్పెషల్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ కంటి వెలుగు క్యాంపు వివరాలను తెలిసేలా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు వైద్య సిబ్బంది శ్రీనివాస్, శంకర్, పురుషోత్తం, శివ, బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా పాఠశాల వార్షిక క్రీడాపోటీలు



పరుగుపందెం పోటీల్లో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ట్రినిటీ హైస్కూల్లో వార్షిక క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల వరకు జరిగే క్రీడా పోటీలను జిల్లా అదనపు కలెకర్ రాహుల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో తయారు చేసే వేదిక ఒక్క పాఠశాలనే అని, జీవితంలో విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. గెలుపు ఓటములు సహజమన్నారు. తెలంగాణ రాష్ట్ర జూనియర్ వాలీబాల్ కెప్టెన్ జాతీయ క్రీడాకారుడు, ట్రినిటీ పాఠశాల విద్యార్థి అనుదీప్‌ను ఘనంగా సన్మానించారు. అంతకుముందు స్పోర్ట్స్ జెండా ఎగురవేశారు. క్రీడాకారులతో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అనంతరం క్రీడాజ్యోతిని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, ప్రిన్సిపాల్ జాన్‌థామస్, వైస్ ప్రిన్సిపాల్ బిజుకురివిల్లా, డైరెక్టర్ సుమనాజాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనిని సందర్శించిన స్టార్ రేటింగ్ సభ్యులు



గని వివరాలు తెలుసుకుంటున్న తనిఖీ సభ్యులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గనిని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్టార్‌రేటింగ్ తనిఖీ బృందం సభ్యులు సందర్శించారు. మంగళవారం కమిటీ సభ్యులు డి.సుబ్రమణ్యం, డాక్టర్ చంద్రశేఖర్, పి.మోహన్‌రావులతో పాటు కంపెనీ అధికారులు ఉన్నారు. ముందుగా గని మేనేజర్ ఈ తిరుపతితో కలిసి గనిలో బొగ్గు ఉత్పత్తి, రక్షణ చర్యల వివరాలను తెలుసుకున్నారు. భూగర్భ గని మ్యాప్‌ను పరిశీలించారు. బొగ్గు రవాణా ఎలా చేస్తున్నారు తెలుసుకున్నారు. గనిలో ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం గనిలోకి దిగి ప్రత్యక్షంగా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ ఏవీ రెడ్డి, గ్రూప్ ఇంజనీర్ వీరన్న, క్వాలిటీ ఇంచార్జీ వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు కాదాసి శ్రీనివాస్, మోహన్‌రావు, సాంబయ్య, మహేష్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్, పిట్ సెక్రెటరీ చిలుముల రాయమల్లు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

ఉద్యోగ నియామకపత్రాల అందజేత



నియామకపత్రాలు అందుకున్న వారితో జీఎం

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 29మందికి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యబోస్, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏజెంట్‌కు ఏఐటీయూసీ నేతల సన్మానం

శ్రీరాంపూర్: ఆర్కే 5గ్రూప్ ఏజెంట్ ఏవీ రెడ్డిని ఏఐటీయూసీ నేతలు ఘనంగా సన్మానించారు. ఇటీవల సీఎంఓఏఐ సీనియర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మంగళవారం ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి బాజీసైదా, కేంద్ర కార్యదర్శి సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ కొమురయ్య, నాయకులు పాల్గొన్నారు.

గీత కార్మికులు జాగ్రతలు పాటించాలి

చెన్నూర్: గీత కార్మికులు కల్లు సేకరించే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎక్సైజ్ సీఐ హరి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని గోదావరి ఒడ్డున గల తాటివనంలో ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు మంగళవారం గీతా కార్మికులు తాటి చెట్లు ఎక్కే విధానం(క్లెంబర్)ను ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. కొత్తగా లైసెన్స్‌లు పొందిన గీత కార్మికులకు క్లైంబర్ నిర్వహించారు. కార్మికులకు పలు సూచనలు చేశారు. లైసెన్స్‌ల గడువు ముగిసిన వెంటనే రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్, గౌడ్‌సంఘం అధ్యక్షులు కుర్మ అశోక్‌గౌడ్, రఘుగౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని బీఎస్పీ జోనల్ కన్వీనర్ మద్దెల భవాని డిమాండ్ చేశారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మందమర్రిలో ఏజెన్సీ చట్టం అమల్లో ఉన్నప్పటికీ మార్కెట్ నడిబొడ్డులో గంప శంకరయ్య కుమారులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దీక్షలు

చెన్నూర్: పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోలీసు నియామకాల్లో జరిగిన అవకతవకలకు నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. యువజన కాంగ్రెస్ పార్టీ నియోకవర్గ అధ్యక్షుడు బుర్ర కిష్టగౌడ్ మాట్లాడుతూ పోలీసు, ఎస్సై నియామకాల్లో నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందన్నారు. అర్హత ఉన్నా, పోలీసు కాలేదని మనఃస్తాపం చెందిన నెన్నలకు చెందిన యువకుడు మృతి చెందాడని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

పాఠశాలలో ముగ్గుల పోటీలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన పది మంది మహిళలకు వేయి రూపాయల నగదుతో పాటు పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్‌అజీజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక రైసింగ్‌సన్ పాఠశాలలో ఈ నెల 12న పాఠశాల విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ ఉస్మాన్‌పాషా తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 11లోపు పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

‘అన్ని విధాలా ఆదుకుంటాం’

నెన్నెల: ఆత్మహత్యకు పాల్పడిన పుప్పాల రఘు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం ఆయన నెన్నెలలో రఘు కుటుంబాన్ని పరామర్శించారు. యువకుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సహకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి ఇబ్రహీం, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

టెస్ట్ పరీక్షల్లో చాయిస్ ప్రశ్నలు పెంచాలి

మంచిర్యాలఅర్బన్: టెస్ట్ పరీక్షల్లో చాయిస్ ప్రశ్నలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి అన్నారు. వ్యాసరూప ప్రశ్నలు సెక్షన్ వారీగా చేయాలని, పరీక్షలు రోజు విడిచి రోజు నిర్వహించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రంను సెక్టోరల్ అధికారి సప్దర్‌అలీఖాన్‌కు అందజేశారు.

ఘనంగా విశ్వ హిందీ దివాస్

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం హిందీ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కొండ రాజేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీదేవి, భాగ్యలక్ష్మి, దబ్బెట రాజమల్లు, రవీందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

పాతమంచిర్యాల: నిజామాబాద్ జిల్లా కోటగిరిలో గణేశ్ ఉత్సవాలకు విరాళం ఇవ్వలేదనే కక్షతో ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌పై మతోన్మాద మూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్లిఖార్జున్‌ను వేధించి, అవమానపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ హక్కులు కాపాడుకోవడం కోసం ప్రజాస్వామికవాదులు పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గూళ్ల బాలాజీ, అబ్బోజు రమణ, రామగిరి రామస్వామి పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి’



మాట్లాడుతున్న కొక్కిరాల సురేఖ

రామకృష్ణాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగట్టాలని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం హాత్ సే హాత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను మోసగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి ప్రజలకు విముక్తి కలగాలంటే కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాద్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, నూకల రమేష్, పల్లెరాజు, జీవన్, ఫయాజుద్దీన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జోడో యాత్రను విజయవంతం చేయాలి

నెన్నెల: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఈ నెల 26 నుంచి నిర్వహించే హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ బండి ప్రభాకర్, పార్టీ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్ము రాజన్నయాదవ్ పిలుపునిచ్చారు. నెన్నెలలో మంగళవారం నిర్వహించిన నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నెన్నెల, వేమనపల్లి, కన్నెపల్లి, భీమిని మండలాల పార్టీ అధ్యక్షులు దాగం రమేష్, సయ్యద్ సాబీర్‌అలీ, రోహిత్, ప్రమోద్‌గౌడ్, డీసీసీ సభ్యులు బానేష్, నాయకులు మొహిద్‌ఖాన్, గోవింద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూదన్ నాయక్



అలారంను అందజేస్తున్న మధుసూదన్ నాయక్

మంచిర్యాలఅగ్రికల్చర్: త్వరలో జరిగే పదో తరగతి 2022–23విద్యా సంవత్సరం పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) మధుసూదన్ నాయక్ అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం తన తండ్రి రాగ్యా నాయక్ జ్ఞాపకార్థం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాల అధికారులు, వార్డెన్లకు 10వ తరగతి విద్యార్థుల కోసం తరగతి గదికి ఒకటి చొప్పున 42అలారం గడియారాలను అందించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు 16, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు 8, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహాలకు 15, అల్ప సంఖ్యాక సంక్షేమ వసతి గృహాలకు 3 అలారం గడియారాలను అందించారు. కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు రవీందర్ రెడ్డి, వినోద్‌కుమార్, నీరటి రాజేశ్వరి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదు

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



సమస్యలపై అధికారిని నిలదీస్తున్న సభ్యులు

బెల్లంపల్లి(తాండూర్): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ అప్పలనాయుడు నివేదిక చదువుతుండగా తాండూర్ మండలానికి రోడ్ల అభివృద్ధికి ఇప్పటి వరకు ఎన్ని నిధులు వచ్చాయని, పనులు ఏ మేరకు జరిగాయని ఎమ్మెల్యే ఏఈని వివరాలు అడిగారు. తాండూర్ మండలానికి రూ.6కోట్ల నిధులు మంజూరయ్యాయని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు సాగడం లేదని ఏఈ బదులు చెప్పగా ఎమ్మెల్యే ఆగ్రహించారు. సీఎస్ఆర్ నిధులతో ద్వారకాపూర్, కొత్తపల్లి, కిష్టంపేట గ్రామాలకు రోడ్ల నిర్మాణాల కోసం 6నెలల క్రితం నిధులు విడుదలైనా పనులు సాగక పోవడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే చేపట్టేందుకు కాంట్రాక్టర్‌లతో మాట్లాడాలని ఆదేశించారు. రెండు రోజుల్లో మండల అభివృద్ధి కోసం ఉపాధిహామీ పథకం ద్వారా రూ.కోటి మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ పైపులైన్ల కోసం గ్రామాల్లో తవ్విన కాలువలను వెంటనే పూడ్చి వేసి పనులు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారి ప్రభాకర్ నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని గ్రామాల్లో ఇళ్లపై నుంచి హైటెన్షన్ లైన్‌లు ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని వాటిని తొలగించాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ సంయుక్తంగా రైతులకు అధిక ఆధాయాన్ని ఇచ్చే ఉద్యానవన సాగు, పందిరి సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులు నివేదిక చదివి సమావేశాన్ని మమా అనిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, వైస్ ఎంపీపీ దాగం నారాయణ, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు సిరంగి శంకర్, మాసాడి శ్రీదేవి, గోమాస స్వాతి, మొగిళి శంకర్, కో–ఆప్షన్ సభ్యుడు రహ్మాదుల్లాఖాన్, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో స్వరూప ఆధ్వర్యంలో నవజాత శిశువుల ఆరోగ్యం, బలహీనం కాకుండా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 21 మాడ్యుల్స్‌లో ఉండే ఈ అంశాలపై విడతల వారీగా అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సులోచన, చందన, ప్రసన్న, ఇందిర, రమ, సంధ్య, స్వప్న, సరిత, శ్రీలత, రమ పాల్గొన్నారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీయూజిసెట్ ప్రకటనను విడుదల చేసినట్లు మంచిర్యాల మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుమతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ నెల 5వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని, మార్చి 5వ తేదీన ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. అడ్మిషన్లు, దరఖాస్తుల కోసం www.tswreis.ac.in వెబ్‌సైట్‌లో గానీ 79950 10674 నంబరులో సంప్రదించాలని కోరారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం: నేతకాని కులస్తులందరం ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకుందామని నేతకాని మహార్ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్ అన్నారు. ఈ నెల 22న రామగుండంలో నిర్వహించే నేతకాని మహా ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. నేతకాని హక్కుల సాధన కోసం ఉద్యమించాలని సూచించారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.